

కొనుగోలు కేంద్రాల కోసం డిమాండ్

ప్రజాశక్తి - చాగల్లు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు బుద్ధుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడారు. పండించిన పంటను రైతుల నుంచి సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వ విఫలమవుతుందన్నారు. దళారుల ద్వారా అమ్ముకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. ఆర్‌బికెల ద్వారా కొనుగోళు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పించడం తప్ప ఇప్పటి వరకూ ఏర్పాటు చేసింది లేదన్నారు. ఇప్పటికే చాలా చోట్ల కోతలు పూర్తయ్యాయని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర ప్రకటించాలని రైతులను అప్పుల నుండి గట్టెక్కించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు


ఇంటి బడ్జెట్ తలకిందులు

గుదిబండగా గ్యాస్‌బండ
సలసలా కాగుతున్న వంట నూనెలు
పెనుభారంగా పెట్రో, విద్యుత్ ఛార్జీలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దిగువ మధ్యతరగతి కుటుంబాల ఇంటి బడ్జెట్ తలకిందులైంది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే నిత్యావసరాల కోసం నెలవారీ బడ్జెట్ రూ.15వేల నుంచి రూ.18వేలకు చేరింది. గతేడాదితో పోల్చితే ధరలు పెరగటమే తాజా పరిస్థితికి కారణం. అయితే ఆ స్థాయిలో ఆదాయాలు లేకపోవడంతో ప్రతిఒక్కరిలోనూ ఆందోళన నెలకొంది. ప్రస్తుతం మార్కెట్లలో పెరుగుతున్న నిత్యావసర సరుకులు, పెట్రో, గ్యాస్ ధరలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండు నెలల కాలంలో పలు నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోలు, డీజిల్, గ్యాస్, వంట నూనెలు, విద్యుత్ ఛార్జీలు సామాన్యులపై దండెత్తుతున్నాయి. పెరుగుతున్న ధరల దాడికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధరల నియంత్రణపై చర్యలు చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

గతంలో ఎన్నడూలేని విధంగా నూనెల ధరలు ఆకాశంనంటుతున్నాయి. కిలో సన్‌ఫ్లవర్ నూనె రూ. 145 నుంచి రూ. 150 ఉన్న ధర ప్రస్తుతం రూ. 195 నుంచి రూ. 200 వరకు చేరింది. పామాయిల్ ధర రూ. 120 ఉండగా ప్రస్తుతం రూ. 160 వరకు పలుకుతోంది. పల్లి నూనె ధర రూ.180 నుంచి రూ. 230 వరకు చేరింది. ఇలా పలు నూనెల ధరలు పెరుగుతున్నాయి. ఇదే అదనుగా భావించిన పలువురు వ్యాపారులు నో స్టాక్ పేరిట అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. లీటరు పెట్రోలు రూ.111.30 పైసలుండగా, డీజిల్ రూ.98కి చేరింది.



కేంద్ర, రాష్ట్ర పన్నులమోతతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇందనం ధరల పెంపు అన్ని రంగాలపై పడుతోంది. రవాణా ఛార్జీలు పరగడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలపై భారాలు తప్పడం లేదు.

నిత్యావసరాలు అదే బాటలో...

గత నెలలో పచ్చిమిర్చి కిలో రూ.30 ఉండగా, ప్రస్తుతం రూ.45కు చేరింది. కిలో కంది పప్పు రూ.110 నుంచి రూ.130 వరకు, మినుములు రూ. 100 నుంచి రూ. 140, పెసరపప్పు రూ.100 నుంచి రూ.120, చక్కెర రూ.35 నుంచి రూ.45 వరకు, గోదుమలు రూ. 50 నుంచి రూ. 65 వరకు పెరిగాయి. మరో వైపు గ్యాస్ ధరలు నెలవారీగా పెంచుతుండడంతో రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు మళ్లీ కట్టెల పొయ్యే దిక్కయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతేడాది14 కేజీల సిలిండర్ ధర రూ.930 నుంచి దశల వారీగా పెరుగుతూ తాజాగా రూ.1210కి చేరింది. గ్యాస్ ధర పెంపుతో నెలకు జిల్లా ప్రజలపై రూ. అరకోటి మేరకు అదనపు భారం పడుతోంది. తాజాగా విద్యుత్ ఛార్జీలు సైతం సర్ చార్జీల పేరుతో మోత మోగుతున్నాయి. యూనిట్ ధర పెరగడంతో ఏప్రిల్ ఒకటవ తేది నుంచి విద్యుత్ బిల్లులు భారం అదనంగా మారింది. గృహావసరాల విద్యుత్ చార్జీ రూ. 0.40 పైసలు నుంచి రూ. 0.50 పైసల వరకు పెరిగింది. కమర్షియల్, పరిశ్రమలు, వీది దీపాలు, వాటర్ వర్క్స్ తదితర వాటికి రూ. 1 నుంచి రూ. 1.50 పైసల వరకు పెరిగింది.

పెరిగిన ఇంటి బడ్జెట్

మా ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటున్నాం. నిత్యావసర సరుకుల కొనుగోలుకు కనీసంగా రూ.8వేలు వెచ్చించక తప్పడం లేదు. టు వీలర్ పెట్రోల్ బిల్లు నెలకు రూ.3వేల చేరింది. విద్యుత్, పాల బిల్లు కలిపి మరో రూ.3వేలు అవుతోంది. ఇంటి పన్నులు పెరగటంతో ఇంటి అద్దె పెంచేశారు. గతంలో రూ.4,500 ఇప్పుడు రూ.5వేలు చెలించాల్సి వసుంది. జీతం చాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్య అవసరాలకు చేతిలో చిల్లిగవ్వ ఉండట్లేదు.

- వి. రాజేష్ సుబ్బారావు పేట రాజమహేంద్రవరం

ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి

పాలక ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామనే ప్రచారం విస్తృతంగా చేస్తున్నాయి. మరో వైపు దొడ్డిదారిన పన్నులు, ఛార్జీల రూపంలో వసూలు చేస్తున్నాయి. ప్రతి కుటుంబంలో భార్యభర్తలు ఇద్దరూ కష్టపడినా కుటుంబ ఖర్చుల కోసం ఇబ్బందులు తప్పటం లేదు. పాలక ప్రభుత్వాలు చొరవ చూపాలి ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలి. లేని పక్షంలో రాబోయే ఎన్నికలలో ప్రజలు సరైన సమాధానం చెప్తారు.

- కె. రామలక్ష్మి ఆర్యాపురం, రాజమహేంద్రవరం

సుగర్ ఫ్యాక్టరీని తెరవాలి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో జైపూర్ సుగర్ ఫ్యాక్టరీని తక్షణం తెరవాలని ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 13 మండలాల్లో 280 గ్రామాలు చెరుకును పండించే రైతులు ఈ ఫ్యాక్టరీపై ఆధారాపడి జీవించేవారన్నారు. పరోక్షంగా అనేక వృత్తుల వారు ఉపాధి పొందేవారన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉండగా జగన్ పాదయాత్రలో ఈ సమస్యపై స్పందించారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని తానేటి వనితతో కలిసి ఆయన హామీ ఇచ్చారన్నారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పారన్నారు. రాష్ట్రంలో 29 చెరకు ఫ్యాక్టరీలకు నేడు ఐదు ఫ్యాక్టరీలు మాత్రమే పని చేస్తున్నాయన్నారు. పొరుగు రాష్ట్రాల్లో చెరకు ఉత్పత్తి పెరిగితే ఇక్కడ క్రమంగా తగ్గుతుందన్నారు. కొత్త పరిశ్రమలు స్థాపించడం మాట అలా ఉంచి ఇప్పటికే మూతబడిన పరిశ్రమలను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం అనేక ప్రయివేటు కంపెనీలకు, వ్యక్తులకు లక్షల కోట్ల రూపాయలను రాయితీగా ఇస్తుందన్నారు. కొన్ని వందల కుటుంబాలు జీవనోపాధికి సంబంధించిన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోవడం వల్ల స్థానిక రైతాంగం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 14న కొవ్వూరు వస్తున్న ముఖ్యమంత్రి చాగల్లు సుగర్ ఫ్యాక్టరీపై స్పందించాలని ఆయనతో పాటు చెరుకు రైతు సంఘం నాయకులు కొడవటి వెంకటరాయుడు, కొట్టూరు నాగేశ్వరరావు, కంకటాల బుద్ధుడు, కొటారు రంగారావు తదితరులు కోరుతున్నారు.



రహదారిపైకి చేరుతున్న పొగ

కెనాల్ రోడ్డును కమ్మేస్తున్న పొగ

ప్రజాశక్తి- కడియం

నిత్యం వాహనాలతో రద్దీగా వుండే వేమగిరి నుంచి సామర్లకోట వెళ్లే కెనాల్ రోడ్డును పొగ కమ్మేస్తోంది. ఫలితంగా వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేమగిరి గ్రామంలో సేకరించిన చెత్తను వాహనాల ద్వారా తీసుకొచ్చి జిఎంఆర్ పవర్ ప్రాజెక్ట్ సమీపాన డంప్ చేస్తున్నారు. ఈ చెత్తను ప్రధాన పంటకాలువ ఒడ్డుకు నెట్టి నిప్పు పెడుతున్నారు. దీనివల్లే వచ్చే పొగ రహదారికి కమ్మేస్తోంది. కనీసం ఎదురుగా వచ్చే వాహనం కూడా కనబడనంతగా పొగ కమ్మేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం పొగ కమ్మేయడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి పెను ప్రమాదం సంభవించకముందే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆస్తి తగాదాల నేపథ్యంలో హత్య

ప్రజాశక్తి- ధవళేశ్వరం

ఆస్తి తగాదాల నేపథ్యంలో ధవళేశ్వరంలోని స్థానిక సాయినగర్‌కు చెందిన సిద్ధిరెడ్డి రవికుమార్(35) హత్యకు గురయ్యాడు. శ్రీకాకుళం జిల్లా కొత్తకోటకు చెందిన రవికుమార్ వత్తి రీత్యా డ్రైవర్. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి కుటుంబం గ్రామంలోనే స్థిరపడింది. శ్రీకాకుళం జిల్లా కొత్తకోటలో ఉన్న నాలుగు ఎకరాల్లో తన వాటా ఇవ్వమని గ్రామంలోనే ఉంటున్న తన బాబాయి సిద్ధిరెడ్డి శ్రీనివాస్‌రావును శనివారం కోరారు. ఈ నేపథ్యంలో ఇరువురికీ వాగ్వాదం చోటు చేసుకుంది. అదేరోజు సాయంత్రం శ్రీనివాస్‌రావు కుమారుడు రమేష్‌నాయుడు రవికుమార్‌కు ఫోన్ చేశాడు. ఇంటికి రా మాట్లాడుకుందాం అని చెప్పాడు. దీంతో రవికుమార్ వారి ఇంటికి వెళ్లాడు. అక్కడ మాటామాటా పెరగడంతో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో శ్రీనివాసరావు రవికుమార్‌ను గట్టిగా పట్టుకున్నాడు. శ్రీనివాసరావు కుమారుడు రమేష్‌నాయుడు చాకుతో రవికుమార్‌ను విచక్షణా రహితంగా పొడిచాడు. దీంతో రవికుమార్ అక్కడికక్కడే మతి చెందాడు. రవికుమార్ భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. సిఐ కె.మంగాదేవి ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితులు శ్రీనివాసరావు, రమేష్‌నాయుడు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

సిఎం పర్యటనను జయప్రదం చేయాలి

మంత్రులు వేణుగోపాలకృష్ణ, వనిత

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14న సిఎం కొవ్వూరులో పర్యటించనున్నారు. ఈ ప్రాంతాలను మంత్రులు తానేటి వనిత, వేణుగోపాలకృష్ణ, సిఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎస్‌పి సుధీర్‌కుమార్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆదివరం పరిశీలించారు. హెలీప్యాడ్, సభావేదిక స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడారు. కొవ్వూరులోని గోష్పాదాల రేవు ప్రాంతం, సత్యవతి నగర్, బుద్ధుడు జంక్షన్, యువరాజ్ హోటల్ సెంటర్ ప్రదేశాలను పరిశీలించామన్నారు. సిఎం కార్యక్రమానికి అనువుగా ఉన్న హెలీప్యాడ్ స్థలాన్ని బుద్ధుడు జంక్షన్ వద్ద, సభావేదికను సత్యవతి నగర్‌లోని హోం మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సిఎం పర్యటన నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఏప్రిల్ 14న 'వాలంటీర్ వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వాలంటరీల్కు సేవా పురస్కారాలను సిఎం అందిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించనున్నారని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో విధులు నిర్వహించాలన్నారు. సిఎం కార్యక్రమాల సలహాదారు,



సిఎం పర్యటనా స్థలాలను పరిశీలిస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎస్‌పి తదితరులు

ఎంఎల్‌సి తలశిల రఘురాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశా నిర్ధేశం చేశామన్నారు. అనంతరం కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. సచివాలయ సిబ్బందికి అవార్డులు, నగరు పురస్కారాలు అందించే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి జిల్లా వేదిక కానుందన్నారు. కొవ్వూరులో ఏర్పాటు చేసిన వేడుకలకు సమయం తక్కువుగా ఉన్నందున అధికారులు వారికి కేటాయించిన విధులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 512 సచివాలయాల నుంచి సుమారు 18 వేల మంది వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఈ వేడుకలకు రానున్నారన్నారు. సభా వేధిక వద్ద 24 గ్యాలరీలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో హెలీప్యాడ్ నుంచి సభా వేధిక వరకు రోడ్ షోకు సంబందిత ఏర్పాట్లు ఆర్ఎంసి మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్యాలరీలకు సంబంధించి వాటర్ ప్యాకెట్స్, అల్పాహారం, మెడికల్ క్యాంపులు ద్వారా ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. బహిరంగ సభకొచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా కార్యాచరణ ప్రణాళిక కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎస్‌పి సిహెచ్.సుధీర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సిఎం పర్యటనకు సంబందించిన హెలీప్యాడ్, రోడ్ షో, సభావేదిక వద్ద కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తుతో పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు పార్కింగ్ సౌకర్యం కోసం స్థలాలు గుర్తిస్తున్నాట్లు తెలిపారు జెసి ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ కార్యక్రమానికి సంబందించి ప్రజలను తీసుకొచ్చేందుకు 550 ప్రయివేటు, 400 ఆర్‌టిసి బస్సులను ఆయా రూట్స్ వారీ సిద్ధం చేస్తామన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ సిఎం రోడ్ షోకు సంబందించి బారికేడ్ల ఏర్పాటు, ప్రజలకు తాగునీరు, అల్పాహారం అందిస్తామని, సభావేధిక వద్ద ప్రతి గ్యాలరీలో మెడికల్ కిట్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఏలూరు రెంజ్ డిఐజి పాల్‌రాజు, డిఆర్ఒ జి.నరసింహులు, ఎంఎల్ఎలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వరరావు, స్థానిక నాయకులు ఎస్.రాజీవ్‌కృష్ణ, మాజీ ఎంఎల్‌సి కోడూరు శివరామకృష్ణ, ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి, డిసిహెచ్ఒ డాక్టర్ సనత్ కుమారి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ముస్లిములతో కలిసి విందు చేస్తున్న కుందుల

ముస్లిములకు 'కుందుల' ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - నిడదవోలు

టిడిపి నిడదవోలు నియోజక వర్గ నాయకులు కుందుల వీరవెంకటసత్యనారాయణ ముస్లిములకు ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. గణపతి సెంటర్ వద్ద ఉన్న పెద్ద మసీదులో ముస్లిములతో కలిసి ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు గూడపాటి వెంకట్రావు, తెలుగుయువత పట్టణ మాజీ అధ్యక్షులు ఎస్‌కె.బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పేరూరి సాయిబాబా, నాయకులు వాకలపూడి వెంకటరత్నం, కె.లీలాకుమార్, ఎం.శ్రీనివాస్, ఎం.రాధా, జి.శ్రీనివాస్, కె.నరేష్, ఎ.శివ పాల్గొన్నారు

వనువులమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - కడియం

కడియం గ్రామ దేవత శ్రీ వనువులమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు కందుల దుర్గేష్, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేలాదిమంది భక్తులు ఈ అన్నదానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కడియపు సావరం సర్పంచ్ చెక్కపల్లి మురళి, వెలుగుబంటి నాని, గట్టి సుబ్బారావు, వనుము సూరిబాబు, తమ్మిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి- గోకవరం, దేవరపల్లిలో

మండలంలోని రంప ఎర్రంపాలెంలో ఆదివారం వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ పాటి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతున్నామన్నారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి వ్యత్యాసాలను వివరిస్తున్నామన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలో ఉన్న ప్రశ్నలను నింపి లబ్ధిదారునికి స్లిప్ ఇచ్చి లబ్ధిదారుని అనుమతితో సిఎం జగన్ ఫోటో ఉన్న స్టిక్కర్‌ను డోర్‌కు అంటిస్తున్నామన్నారు. అనంతరం సిఎం జగన్ పాలనకు మద్దతు తెలిపేందుకు ఒక ఫోన్ నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని లబ్ధిదారుని కోరుతున్నామన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం పట్ల ప్రజల్లో విశేష స్పందన వస్తుందని ఆయన తెలిపారు. దేవరపల్లిలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి కెవికె.దుర్గారావు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తిరుగుతూ జగన్ పాలన గురించి వివరించారు .అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కవల శ్రీనివాసు, టౌన్ అధ్యక్షులు గంగాధర్ సచివాలయ కన్వీనర్ కుక్కల సత్యనారాయణ పాల్గొన్నారు

సేవే ధ్యేయంగా 'బుద్ధిస్ట్ కౌన్సిల్'

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సేవే ద్యేయంగా బుద్ధిస్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పనిచేస్తుందని ఉండ్రాజవరం బౌద్ధ దమ్మ పీఠాధిపతి అనాలయో తెలిపారు. బుద్ధిస్ట్ కౌన్సిల్ రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం ఆదివారం తాడిపత్రులోని బుద్ధ విహార్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధ ధమ్మాలు ప్రచారం చేయడమే ద్యేయంగా పనిచేయాలన్నారు. జిల్లాల వారీగా బుద్దిస్ట్ ప్రతినిధులు పలు విషయాలపై చర్చించారు. తాడిపత్రులో విశాలమైన పచ్చని తోటలు మధ్య, ప్రశాంత వాతావరణంలో దమ్మ విజయ, బుద్ధ విహార్‌లను నిర్మించనున్నట్లు కరుటూరి విజయచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా రావులపాలెం సమీపంలో కేతరాజుపల్లిలో బుద్ధిస్ట్ కాండ్రు వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్మించనున్న బుద్ధ విహార్ గురించి చర్చించి, కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సుబ్బారావు, ఎ.రామేశ్వరరావు, పి.పవన్ ప్రసాదు, ఎన్.కృష్ణారావు, వడ్డి శ్రీనివాసరావు, బౌద్ధులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇలా చేస్తే ప్రజలు మనల్ని చరిత్రలో లేకుండా చేస్తారేమో సార్..!!

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు తెల్లవారు జామునే సమాధులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు న్విహించారు. **ధవళేశ్వరంలో** ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులు ఆదివారం తెల్లవారుజాము నుంచే సమాధుల తోటలో ప్రార్థనలు జరిపారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. **ఉండ్రాజవరం** మండలంలో వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అలాగే సమాధులను సందర్శించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. చర్చిల వద్ద అన్న సమారాధనల నిర్వహించారు. **కొవ్వూరు రూరల్‌లో** నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో హోం మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఒకరిపట్ల ఒకరు ప్రేమతో, దయాగుణంతో వ్యవహరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కొవ్వూరు పట్టణంలోని సమాధుల తోటలో ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం దేవరపల్లి మండలం గౌరీపట్నం, తాళ్లపూడి మండలం తుపాకులగూడెంలో పూర్వీకుల సమాధుల వద్ద నివాళులర్పించారు. **తాళ్లపూడి** మండలం పోచవరం గ్రామంలో నిర్వహించిన ఈస్టర్ ప్రార్థనల్లో మంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. మంత్రి వెంట మాజీ ఎంఎల్ఎ జొన్నకూటి బాబాజీరావు సోదరుడు కుమార్, జడ్‌పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ వైసిపి నాయకులు ఉన్నారు. వేగేశ్వరపురం లూథరన్ చర్చి వద్ద మానవతా సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కుల మతాలకతీతంగా ప్రజలకు సహకరించడమే మానవతా ధ్యేయమని మండల శాఖ అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి ఆంజనేయులు, ఈసీ మెంబర్ సనపల రాజశేఖర్, రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురంలో** ఈస్టర్ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిపారు. సమాధులను పూలు, కొవ్వొత్తులతో అలంకరించారు. గోపాలపురం సెయింట్ పౌల్స్ లూథరన్ దేవాలయంలో పాస్టర్ గెల్లా రాజన్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. మండలంలో అన్ని గ్రామాలలో దేవాలయాలలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి తానేటి వనిత



ధవళేశ్వరంలో విద్యుత్ వెలుగుల్లో సమాధులతోట

మందుబాబులకు అడ్డాగా చెరువుగట్టు

ప్రజాశక్తి - యానాం

కేంద్రపాలిత ప్రాంతమైన యానాం గోపాల్ నగర్‌లో ఉన్న 5 ఎకరాల మంచినీటి చెరువు ప్రాంగణం మందుబాబులకు అడ్డగా మారింది. యానాంలో మద్యం తక్కువ ధరలకే లభించడంతో పరిసర ప్రాంతాల నుంచి మద్యం ప్రియులు, ఎందుబాబులు నిత్యం భారీగా తరలి వచ్చి ఇక్కడ మద్యం సేవిస్తుంటారు. ఈ నేపథ్యంలో జనసంచారం తక్కువగా ఉన్న ఖాళీ ప్రదేశాల్లో మందుబాబులు వ్యవహరిస్తున్న తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ చెరువు చుట్టూ ఉదయం సాయంత్రం సమయంలో మహిళలు, వద్ధులు, యువత నిత్యం వాకింగ్ చేస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో మందుబాబులు రాత్రీ పగలూ తేడా లేకుండా ఇష్టానుసారంగా మద్యం సేవించి అతిగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. చెరువుగట్టు పొడవున కుప్పలు తెప్పలుగా రోడ్లపై బీరు బాటిళ్లు, మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. అంతేకాక చాలా కాలంగా మంచి నీటి చెరువు పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. రోజు రోజుకూ అక్కడ పరిస్థితి అధ్వానంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు మద్యం సేవించి ఆ బాటిల్స్ పగలగొట్టడం, రోడ్డుపై వదిలివేయడం వల్ల అసౌక ర్యంగా ఉంటోందని మహిళలు వాపో తున్నారు. సుమారు 200 మంది పిడబ్ల్యుడి శాఖకు సంబంధించి ఉద్యో గులు ఉన్న 55 ఎకరాల చెరువులో మందుబాబులను, అసాంఘిక కార్య కలాపాలను ఆపలేక పోతున్నారని అంటున్నారు. పిడబ్ల్యుడి శాఖకు సంబంధించిన కొంతమంది ఉద్యో గులు సమయపాలన పాటించకుండా, విధులు సక్రమంగా చేయకుండా, తమ సొంత పనులు చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మంచినీటి చెరువుల వద్ద ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న మందుబాబులు పని పట్టాలని స్థానికులు కోరుతున్నారు.


చెరువు గట్టుమీద మద్యం సీసాలు

నేరాలు ఘోరాలు

యానాంలో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణ పరిధిలో ఒక యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శేరు నూకరాజు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మెట్టకూరు గ్రామ పరిధిలోని మదర్ థెరిస్సా కాలనీకి చెందిన బొజ్జ సాయి ప్రవీణ్ (23) తన స్వగహంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ప్రవీణ్ గాడిమొగలో ఎల్ అండ్ టి కంపెనీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కాజులూరు

కొత్త మంజేరు గ్రామానికి చెందిన మాసగిరి సూరిబాబు (30) ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రెవెన్యూ సిబ్బంది గొల్లపాలెం పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం..కాజులూరులో కాదా శివకు సంబంధించిన చికెన్ షాపులో మాసగిరి సూరిబాబు రెండేళ్లుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో కోళ్లకు సంబంధించి బాయిలర్ మిషన్ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా మిషన్‌కు విద్యుత్తు సరఫరా జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మతుడు సూరిబాబుకు వివాహం అయ్యింది. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ తులసీరామ్, రెవెన్యూ అధికారి బ్రహ్మాజీ, మహిళా పోలీస్ బామరాజు పరిశీలించారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ కేసును ఎస్ఐ తులసీరామ్ దర్యాప్తు చేసినట్లు గొల్లపాలెం పోలీసులు తెలిపారు.


దగ్ధమైన తాటాకిల్లు

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం దళితవాడలో శనివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన తిరుకోటి లక్ష్మికి చెందిన తాటాకిల్లు పూర్తిగా దగ్ధమై కట్టు బట్టలతో మిగిలారు. ప్రమాద స్థలానికి చేరుకున్న మండపేట అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు, మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియ రాలేదు. ఆస్తి నష్టం రూ.90 వేలు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రమాద సంఘటన స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది, టిడిపి, వైసిపి నాయకులు సందర్శించారు. బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, టిడిపి నాయకులు పువ్వల చిట్టిబాబు, కొప్పిశెట్టి వాసు, దొమ్మేటి వీర్రాజు, గొల్లపల్లి శ్రీను, వారా సురేష్, నేతల అన్నవరం, తదితరులు, బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు, బియ్యం, అందజేశారు. వైసిపి నాయకులు కట్టా మురళీకృష్ణ, చింతా పెద్దకాపు, ఎంపిటిసి సభ్యుడు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, విఆర్ఒ ప్రసాద్ తదితరులు, బాధితులను పరామర్శించి బియ్యం, నగదును, అందజేశారు.


కోల సంబరం కళారూప ప్రదర్శన దృశ్యం

ఆకట్టుకున్న కోల సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రాజు చెరువు రామాలయం వీధిలో పెద్దాపురం మండలం కట్టమూరుకు చెందిన ప్రముఖ జానపద కళాకారుడు కుంచె అచ్చారావు బృందం ప్రదర్శించిన వెంకన్నబాబు పాట (కోలసంబరం) ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. వెంకన్న బాబు జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలన్నీ కళాకారులు ఆయా పాత్రల వేషధారణలతో, ఆట, పాటలతో ప్రదర్శించడం విశేషం. ప్రాచీన జానపద బాణీలతో ఆలపించిన ఈ కళారూపంలో డప్పు, డోలక్, జముకు వాయిద్య పరి కరాలు శబ్ద విన్యాసాల మధ్య ఈ కళా రూపాన్ని కళా కారులందరూ రక్తి కట్టించారు. ఈ కళారూపాన్ని తిలకి ంచిన ప్రేక్షకులు లోవరాజు ఆధ్వర్యంలో కళాకారులను అభినందించారు. ఈ ప్రదర్శనలో బంద నాయకుడు కుంచే అచ్చారావు, రాజు, శ్రీను, ఏసు, దొర బాబు, ఉప్పి డి లోవబాబు, యాసరపు రాజు, గొర్ల ఆంజ నేయులు, కుంచే వీర్రాజు, కుంచే ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.


కొత్తపేటలోని విద్యుత్ సేవా కేంద్రం

నిరుపయోగంగా విద్యుత్ సేవా కేంద్రం

ప్రజాశ-కొత్తపేట

అధికారుల అలసత్వం కారణంగా విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం నిరుపయోగంగా మారింది. సేవా కేంద్రం కొన్ని రోజులుగా తాళం వేసి ఉండడంతో వినియోగదారులు అక్కడికి వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. మండల కేంద్రం బస్టాండ్ సెంటర్లో ఉన్న విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం కొన్ని రోజులుగా తెరవడం లేదు. ఈ సేవా కేంద్రం పరిసర ప్రాంతాల్లో ప్రజలకు విద్యుత్ బిల్లులు కట్టించు కునేందుకు, కరెంట్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే తెలిపేందుకు దీనిని ఏర్పాటు చేశారు. కొన్ని ఏళ్లుగా ఈ కేంద్రం వినియోగదారులకు సేవలు అందించింది. అయితే ఈ కేంద్రాన్ని కొన్ని రోజులుగా తెరవక పోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడు తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

500 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గాడిమొగ పంచాయతీ చినవలసలలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 500 మందికి వైద్య సేవలందించారు. చిన్నారులకు చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై వైద్యులు ధర్మేంద్ర, ఉజ్వల పరీక్షలు చేశారు. మహిళలు వద్ధులకు జనరల్ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు ధర్మేంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ మచ్చ గంగాధర్ రావు, వైద్య సిబ్బంది చందన, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నూకాలమ్మ జాతరకు యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం కాంద్రకోట గ్రామంలో 45 రోజులపాటు జరిగే నూకాలమ్మ జాతర కు 3వ ఆదివారం అనేక పాంతాల నుండి వేలాదిగా యాత్రికులు తరలి వచ్చారు. ఆలయ పరిసరాలే కాకుండా గ్రామంలోని వీధులన్నీ జనంతో నిండిపోయాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ గవరసాన వీరాస్వామి(బాబ్జి) ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది యాత్రికులు ఇబ్బందులు పడకుండా పలు సేవలు అందించారు. క్యూలైన్లలో యాత్రికులు గంటల తరబడి వేచి ఉండకుండా వేగవంతంగా మొక్కు బడులు చెల్లించుకునే విధంగా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని గీతా శివ భక్త యువజన సంఘం ఆధ్వర్యంలో జడ్పిటిసి గవరసాన సూరిబాబు, సర్పంచ్ మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపిటిసి జాగు వీరభద్రరావు, సొసైటీ చైర్మన్ పళ్ల గంగారావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, గవరసాన రాజశేఖర్ యాత్రికులకు మజ్జిగ, యాత్రికుల పిల్లలకు ఉచితంగా పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బావిశెట్టి గంగరాజు, రొంగల తమ్మారావు, లక్కాకుల కృష్ణ, వేమవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నూకాలమ్మ జాతరలో యాత్రికులు

వేళంగిలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి -కరప

అంబేద్కర్ జయంతి సందర్భంగా రమ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేళంగి గ్రామంలో క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. రమ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత పితాని అన్నవరం ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఈస్టర్ పండుగ కార్యక్రమంలోని పాల్గొన్నారు. వేలంగి గ్రాడ్యుయేట్స్ ప్రతినిధులు, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై చలివేంద్రం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని యర్రవరం జాతీయ రహదారి చేరువలో వివేకానంద సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ట్రస్ట్ చైర్మన్ మైరాల నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా ప్రతినెల తొమ్మిదో తేదీన గర్భిణులకు పౌష్టికాహారం అందించడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కడలి సత్యనారాయణ, కోశాధికారి అడపా శివప్రసాద్, సారా శ్రీను పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతోనే మహిళాభివృద్ధి

ప్రజాశక్తి-కాజులూరు

రాజకీయ చైతన్యంతోనే మహిళాభివద్ధి సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి పొందుతున్న వైసిపి మండల మహిళా కార్యదర్శి, గొల్లపాలెం ఉపసర్పంచ్ తాడి భువనేశ్వరి దేవిని బోస్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలలో మహిళలకు రాజకీయ చైతన్యం పెరిగిందన్నారు. ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లోను పలు పథకాలలోనూ 50 శాతం మహిళలకు కేటాయించినదన్నారు. ఆయన వెంట పిల్లి సూర్యప్రకాష్, స్థానిక నాయకులు తాడి వాసురెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి అడ్డాల చిత్రం షూటింగ్

ప్రజాశక్తి - కడియం

మండలంలోని లంక ప్రాం తాల్లో సోమవారం నుంచి షూటింగ్ సం దడి షురూ కానుంది. కొత్త బంగారులోకం ద్వారక క్రియేషన్స్ బ్యానర్‌పై అడ్డాల శ్రీకాంత్ దర్శకత్వంలో సినిమా చిత్రీకరణ ఇప్పటికే ఏజెన్సీ, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. రెండవ షెడ్యూల్ సోమవారం కోనసీమ జిల్లా శేరిలంకలో ప్రారంభం కానుంది. ఈ మేరకు సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు ఫేమ్ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్, ఫొటో గ్రాఫర్ చోటా కె.నాయుడు ఆదివారం కడియం నర్సరీలు, రావులపాలెం పరిసర ప్రాంతాల్లో లోకేషన్లను పరిశీలించారు. కొత్త నటీనటులతో నిర్మిస్తున్న ఈ చిత్రంలోని పలు ప్రేమ సన్నివేశాలతో పాటు, పాటల చిత్రీకరణ కడియం నర్సరీల్లో జరుగుతుందని యూనిట్ తెలిపింది. మిర్యాల రవీంద్రరెడ్డి నిర్మాతగా ఉన్న ఈ చిత్రంలో గోదావరి జిల్లాలు, కోనసీమ జిల్లాలోని ప్రకృతి అందాలు, గోదావరి హొయలను చోటా కె.నాయుడు ఫోటోగ్రఫీతో తెరకెక్కిం చనున్నారు. నవరసాలు మేళవింపుతో ఖర్చుకు వెనుకాడకుండా రవీంద్రరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు యూనిట్ తెలిపింది. మొదటి షెడ్యూల్లో 70 శాతం షూటింగ్ పూర్తయ్యిందని, రెండవ షెడ్యూల్ ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందని, దీంతో షూటింగ్ పూర్తవుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు.


చిత్రీకరిస్తున్న దర్శకుడు, ఫొటోగ్రాఫర్

పేరూరులో అపూర్వ కలయిక

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ పేరూరు డిఎస్.శెట్టి, డివి.రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-1997 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల అపూర్వ కలయిక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా అప్పటి హెచ్ఎం నూలు అన్నపూర్ణ,సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి పూర్తి చేసుకుని 26 సంవత్సరాలు పూర్తి అయ్యిన సందర్భంగా ఉపాధ్యాయులు అందర్నీ గుర్తించుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అప్పుటి విద్యార్థిని విద్యార్థులతో పాటు సహ ఉపాధ్యాయులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం అప్పటి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను, పాఠశాలలో పనిచేసిన సిబ్బందిని సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ప్రస్తుత హెచ్ఎం మట్టపర్తి పురుషోత్తం రాజు మాట్లాడుతూ ఈ పేరూరు హై స్కూల్ దినదిన అభివద్ధి చెందుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి సిబిఎస్ఇ సిలబస్‌తో 12వ తరగతి వరకు నిర్వహిస్తారన్నారు. అప్పటి విద్యార్థులలో చనిపోయిన 11మంది స్నేహితుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి కొంత ఆర్థిక సాయం అందజేశారు.



మాట్లాడుతున్నఅప్పటిప్రధానోపాధ్యాయురాలు


అన్న ప్రసాదం స్వీకరిస్తున్న యాత్రికులు

దమ్మెన్నులో 1,600 మందికి అన్నదానం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని దమ్మెన్నులో రామాలయం వద్ద ఆదివారం 1,600 మందికి అన్నదానం నిర్వహించామనినిర్వాహకులు తెలిపారు. శ్రీరామనవమి వేడుకలు ముగింపు సందర్భంగా గ్రామస్తుల సహకారంతో ఈ అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సహకరించిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పందుల మృత్యువాతతో స్థానికుల్లో ఆందోళన

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో స్థానిక అయ్యన్న నగర్, వైయస్సార్ నగర్ చుట్టూ ప్రక్కల ప్రాంతాల్లో ఈ మధ్యకాలంలో అధిక సంఖ్యలో పందులు మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పందుల మృతికి అంతు చిక్కని కొత్త వైరస్ కార ణమా అని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒకవేళ వైరస్ కారణంగా పందులు చనిపోతే అది మనుషులకు సోకే ప్రమాదం ఉందా అని ఆరా తీస్తున్నారు. మున్సిపాలిటీ వారు పందులను తరలించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

పశువుల పాకలకు నిప్పు

ప్రజాశక్తి - గోపాలపురం

గుర్తు తెలియని వ్యక్తులు పశువుల పాకలకు నిప్పు పెట్టారు. ఈ ప్రమాదలో దూడ మృత్యువాత పడగా మూడు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన రాజంపాలెంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... సాపిడి కొండ ప్రాంతంలో రాజంపాలెం గ్రామానికి చెందిన చెల్లింకల రామకృష్ణ సుమారు 15 ఏళ్లుగా రెండు పశువుల పాకలను ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే పశువులను కట్టుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా రెండు పాకలకు నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. యజమాని హుటాహుటిన వెళ్లి ఒక పాకలో ఉన్న ఆవుని రక్షించాడు. మూడు గేదెలు మంటల్లో చిక్కుకున్నాయి. తాళ్లు తెంపుకొని తీవ్ర గాయాలతో బయటికి వచ్చినట్లు తెలిపారు. రెండేళ్ల వయస్సు గల దూడ మృత్యువాత పడింది. గాయపడిన వాటిలో రెండు చూడు గేదెలు ఉన్నాయని రైతు తెలిపాడు. ఒక్కొక్కటి రూ.90వేలు విలువ చేస్తాయని తెలిపారు. స్థానికు వెంటనే కొవ్వూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అవి ఘటనా స్థలానికి చేరుకునే సరికే పాకలు పూర్తిగా కాలి దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. రూ.లక్ష విలువైన రెండు పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయని తెలిపారు. ఒక పాకలో పశువులు, రెండో పాకలో వ్యవసాయ సామగ్రి, 20 బస్తాలు ధాన్యం ఉన్నట్లు తెలిపారు. కాలిపోయి మతి చెందిన దూడ రూ.20 వేలు ఉంటుందని తెలిపాడు. మొత్తం నష్టం విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. గేదెలు చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్నాయని తెలిపారు. గతంలో ఇదే మాదిరిగా పాకకు నిప్పు పెట్టారని తెలిపాడు. గేదెల కట్టిన స్థలానికి సంబంధించి కొందరితో విభేదాలు ఉన్నట్లు తెలిపాడు. ఫైరింజన్ సకాలంలో రాకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. స్థానికంగా ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.


మంటల్లో దగ్ధమవుతున్న పశువులపాకలు

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి మార్గం గంగాధర్ రావు, జెడ్పిటిసి సభ్యులు గూడపాటి రమాదేవి అన్నారు మండల పరిధిలోని అవిడి గ్రామం లింగాల చెరువు పేట, రజిక పేట నందు మండల పరిషత్ రూ.10 లక్షలు నిధుల మంజూరు చేసి డ్రెయిన్, సిసి రోడ్డు నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి, పల్లి దిలీప్, ఎంపిటిసి సభ్యులు నేతల వెంకట, లక్ష్మి,ధూళి సూరి బాబు, సొసైటీ చైర్మన్ నామడి రాజా రత్నం తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సోమవారం కలెక్టరేట్‌లో స్పందన యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌తో పాటూ డివిజన్, మండల, గ్రామ స్థాయి, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా కార్యాలయాల్లోనూ అర్జీలను అధికారులు స్వీకరిస్తారని తెలిపారు. ఎప్పటిలానే ఆర్‌టిసి బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ ఉచిత బస్సు సర్వీసు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉంటుందని తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యానాం వార్తలు

సరయుకు గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డ్


ప్రజాశక్తి - యానాం

అమెరికాలో చదువుతున్న యానాం కనకాల పేట గ్రామానికి చెందిన యువతి బత్తిన సరయు లక్ష్మి రాష్ట్రపతి గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం కోన వివిహెచ్.సత్యనారాయణ (కొండబాబు) సతీమణి ఉమాదేవి మాట్లాడారు. తమ మనవరాలు సరయు లక్ష్మి 15 ఏళ్ల వయసులోనే ఈ గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డు అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు రాత్రనకా పగలనకా సేవలందించినందుకు గాను ది వైట్ హౌస్ వాషింగ్టన్ తన సేవలను గుర్తించి, అమెరికా ప్రెసిడెంట్ జో బైడన్ సంతకంతో గోల్డ్ వాలంటరీ సర్వీస్ అవార్డు దక్కించుకుందని తెలిపారు. తను ప్రజలకు సేవ చేయాలనే దక్పథంతో ఉందని అందుచేత మెడిసిన్ విద్యను చదవాలనుకుంటోందని సరయు లక్ష్మి తల్లిదండ్రులు సింధు వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా సరయు లక్ష్మిని పలువురు అభినందించారు.

బిసిలకు అండగా ఉంటా: సత్తిబాబు

ప్రజాశక్తి - యానాం

బిసిలకు అండగా ఉంటానని నూతనంగా ఎన్నికైన బిసి సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్యనారాయణ (సత్తిబాబు) అన్నారు. ఈ సందర్భంగా తన స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘాల జాతీయ నాయకుడు ఆర్ కష్ణయ్య, బిసి సేన ఎపి అధ్యక్షుడు సొంటి నాగరాజు ఆధ్వర్యంలో తిరుపతిలో శనివారం జరిగిన సమావేశంలో తనను నియమించడం పట్ల కతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్లుగా బిసిల కోసం ఎన్నో పోరాటాలు చేశానని, అప్పటినుంచి బిసిలకు అండగా ఉన్నానని తెలిపారు.


ఎంఎల్ఎను సత్కరిస్తున్న మిల్క్ బాయిలర్స్

ఎంఎల్ఎ అశోక్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - యానాం

యానాంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల జీతాల పెంపునకు కషిచేసిన ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను ఆదివారం ఆయా శాఖల ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. గత నెల మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎల్ఎ అశోక్ పిడబ్ల్యుడి శాఖలో ఓచర్ పెయిడ్ ఉద్యోగులుగా పని చేస్తున్న సిబ్బందికి రూ.10 వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్స్ ఉద్యోగులకు కూడా రూ.18 వేలు వరకు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచుతున్నట్టు ముఖ్య మంత్రి రంగసామి ప్రకటించారు.

బాప్టిస్ట్ చర్చ్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - యానాం

యానాంలోని క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ నగర్‌లోని బాప్టిస్ట్ చర్చిలో పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ ఎల్.ప్రవీణ్ కుమార్ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.రాజారావు, సెక్రటరీ సిహెచ్.జోన్స్ పాల్గొన్నారు.